క్లుప్తంగా

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



ఏలేశ్వరం గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏలేశ్వరం: పోటీతత్వాన్ని అలవర్చుకోవడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ అన్నారు. గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, విజిల్స్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు, పోటీల్లో సత్తా నిరూపించుకోవాలన్నారు. అనంతరం కథలు చదవడం, రాయడం, పద్య పఠనం, వాటి భావాలు చెప్పడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు చాగంటి నరసింహారావు, మామిడి రాము పాల్గొన్నారు.

పోలీసులకు సత్కారం



సత్కారం అందుకుంటున్న ఎస్సై సతీష్, సిబ్బంది

కిర్లంపూడి: ఉత్తమ సేవలు అందించిన స్థానిక పోలీసు స్టేషన్ ఎస్సై జి.సతీష్‌ను, సిబ్బందిని పెద్దాపురం ఎస్‌డీపీఓ శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ మంగళవారం శాలువా, పూలమాలలతో సత్కరించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల పరిష్కారంపై అలసత్వం వహించకుండా, ఎప్పటికప్పుడు బాధితులకు న్యాయం చేయడంతో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు వీరిని సత్కరించామని ఎస్‌డీపీఓ తెలిపారు. సన్మానం పొందిన వారిలో ఇంకా హెచ్‌సీ ఎస్.వెంకటరమణ, అబ్బిరెడ్డి సుబ్బిరామిరెడ్డి, శ్రీనివాస్ దొర, రాజాబాబు, కృపారావు, ప్రసాద్ ఉన్నారు.

ఏపీఈఏపీ సెట్‌కు 999 మంది హాజరు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో రెండో రోజైన మంగళవారం జరిగిన ఏపీ ఈఏపీ సెట్-2025 పరీక్షలకు 999 మంది విద్యార్థులు హాజరైనట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొత్తం 1,069 మంది విద్యార్థులకు 70 మంది పరీక్షలకు హాజరుకాలేదని చెప్పారు. ఉదయం, సాయంత్రం ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

సారా విక్రేత అరెస్టు

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరం గ్రామంలో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ మంగళవారం తెలిపారు. ధర్మవరంలో సారా అమ్మకాలు సాగిస్తున్న వేమగిరి సాయిని అరెస్టు చేసి, అతని నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.


గిరిజన మండలం ఏర్పాటుకు వినతి



చెర్మన్ బొజ్జిరెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలోని పెదమల్లాపురం కేంద్రంగా గిరిజన మండలం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డిని పలువురు బీజేపీ నేతలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలో ఆయనను కాకినాడ జిల్లా బీజేపీ పూర్వ అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి మట్టా మంగరాజు, జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ కించు జోగిరాజు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు దొంతంశెట్టి చంద్రశేఖర్ తదితరులు కలిశారు. ఈ వివరాలను ఉమ్మిడి వెంకట్రావు ఇక్కడి విలేకరులకు వెల్లడించారు. నియోజకవర్గంలోని ఉప ప్రణాళికా ప్రాంతంలోని గిరిజనులకు ప్రభుత్వ ఫలాలు అందడం లేదని వారు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. గిరిజన గ్రామాలు సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే ప్రత్యేక మండలం ఏర్పాటు అవసరం ఉందని వివరించామని తెలిపారు.

మినీ మహానాడు



మాట్లాడుతున్న యనమల

తుని రూరల్: టీడీపీ మినీ మహానాడులో సంక్షేమం, అభివృద్ధి, మహిళలు, యువతకు ప్రాధాన్యమిస్తూ తీర్మానిస్తున్నట్టు మాజీ మంత్రి, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. మంగళవారం తుని మండలం ఎస్.అన్నవరం శివారు సాయివేదికలో ఎమ్మెల్యే యనమల దివ్య అధ్యక్షతన నియోజకవర్గ మినీ మహానాడు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, నిమ్మకాయల చినరాజప్ప, పలువురు మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

కాలుష్య తాండవం

- పట్టణం నుంచి నదిలో కలుస్తున్న వ్యర్థాలు
- అవుట్‌లెట్ లేక అవస్థలు
- రూ.కోట్లు ఖర్చు చేసినా తప్పని దోమల బెడద
- మెరుగుపడని పారిశుధ్యం



తారకరామా నగర్ వద్ద తాండవ నదిలో వ్యర్థాలు



ఇసుకలపేట మురా కాలువ దుస్థితి ఇలా..

తుని: ప్రజలకు మెరుగైన పరిశుభ్రతను కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్న మాటలకు, క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులకు పొంతన లేదు. ఏటా పారిశుధ్య నిర్వహణకు రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు కానరావడం లేదు. ఎటుచూసినా వ్యర్థాలు పేరుకుపోయి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. అధికారంలోకి వస్తే డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తామని చెప్పిన నేతలు, ఆ తర్వాత పట్టించుకోకపోవడం సర్వసాధారణంగా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో డంపింగ్ యార్డు స్థల సేకరణకు చర్యలు తీసుకున్నారు. ఇందుకు రూ.10 కోట్లు నిధులు అవసరమని ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో.. కథ మళ్లీ మొదటికి వచ్చింది. అధికారంలో ఎవరున్నా, ప్రజలకు మాత్రం చెత్త, దోమలతో ఇబ్బందులు తప్పడం లేదు.

పట్టణంలో 30 వార్డుల్లో సుమారు 60 వేల జనాభా ఉన్నారు. ఇతర ప్రాంతాల నుంచి మరో 25 వేల మంది పట్టణానికి రాకపోకలు సాగిస్తారు. సుమారు 14 వేల కుటుంబాలు నివసిస్తున్నాయి. రోజుకు 29 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు పట్టణం నుంచి ఉత్పత్తి అవుతున్నాయి. పారిశుధ్య పనులకు 115 మంది సిబ్బందిని మున్సిపాలిటీ వినియోగిస్తుంది. చెత్త తరలింపునకు 8 ట్రాక్టర్లు, 47 పుష్‌కార్టులు, 10 డంపర్‌బిన్లను వాడుతున్నారు. ఏటా మున్సిపల్ పారిశుధ్య విభాగానికి రూ.1.95 కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తున్నారు. అవసరం ఉన్నంత మేరకు నిధులు ఖర్చు చేసినా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో పాటు మురుగు నీరు పారడానికి అవుట్‌లెట్ లేకపోవడంతో ఇదంతా తాండవ నదిలో కలుస్తోంది. స్వచ్ఛమైన నీటిలో మురుగు కలుస్తుండడంతో కాలుష్యం మితిమీరిపోతోంది. పట్టణ దిగువన ఉన్న గ్రామాల్లో కలుషిత నీరు తాగిన పశువులూ వ్యాధుల బారిన పడుతున్నాయి.

దోమలకు ఆవాసాలుగా..

పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు, గుంతలు దోమలకు ఆవాసాలుగా ఉన్నాయి. వ్యర్థాలను రోడ్డుకు ఇరువైపులా వేస్తున్నారు. వీటిలో పందులు తిష్ట వేస్తున్నాయి. కాలువల్లో పూడికలు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి. అక్కడి నుంచి దోమలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇసుకలపేట, తారకరామా నగర్, కొండవారిపేట, వీరవరపుపేట, ఆర్‌కే కాలనీ, సాయినగర్, మార్కెట్ తదితర ప్రాంతాల్లో ప్రజలు దోమల కారణంగా అనారోగ్యాల పాలవుతున్నారు. ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులకు గురవుతున్నారు. రోగులు ఆస్పత్రులకు వెళితే జేబు గుల్లవుతోంది. దోమల నివారణకు ఏటా రూ.6 లక్షల మేర పారిశుధ్య విభాగం ఖర్చు చేస్తోంది. ఫాగింగ్, బ్లీచింగ్ తదితర వాటిని సక్రమంగా చేయాలి. వీటిని తూతూమంత్రంగా చేస్తుండడంతో ప్రజలకు దోమలు బెడద తప్పడం లేదు.

సిబ్బంది కొరత

పట్టణంలో ఉన్న జనాభా ప్రకారం పారిశుధ్య విభాగానికి 153 సిబ్బంది అవసరం. ప్రస్తుతం 115 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. వీరిలో 8 మందిని కార్యాలయ పనుల కోసం వినియోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం వార్డుకు ఐదుగురు ఉండాలి. ప్రస్తుతం ఇద్దరు కార్మికులు స్వీపింగ్, డ్రైన్లను శుభ్రం చేయడానికి వినియోగిస్తున్నారు. ట్రాక్టర్లు, రిక్షాల విధులకు 38 మందిని వాడుతున్నారు. జీవో 279 ప్రకారం వర్క్ ఫర్ అవుట్‌సోర్సింగ్ విధానంలో 16 వార్డులను ప్రైవేటు వారికి ఇవ్వడానికి టెండర్లు పిలిచారు. 14 వార్డులు మున్సిపాలిటీ, 16 వార్డులు ప్రైవేటు సిబ్బంది పారిశుధ్య పనులు చేయనున్నారు.

సంపాదన రోగాలకే..



కాలువల్లో చెత్తను తీయడం లేదు. ఖాళీ స్థలంలో నీరు నిల్వ ఉండడంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దోమల మందు పిచికారీ చేయడం లేదు. దోమల వలన రోగాలు సోకి సంపాదనలో సగం మందులకు ఖర్చు చేయాల్సి వస్తోంది.

– మహేష్, వ్యాపారి, తుని

స్థల సేకరణకు చర్యలు



గత ప్రభుత్వ హయాంలో కంపోస్టు యార్డుకు అవసరమైన స్థల సేకరణకు ప్రతిపాదనలు పంపారు. హంసవరం వద్ద డి-పట్టా భూమి కొనుగోలుకు ప్రభుత్వ అనుమతి కోసం పంపించారు. త్వరలో భూసేకరణ పూర్తి చేస్తాం. పారిశుధ్య నిర్వహణ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. మురుగు నీరు శుద్ధి చేసే ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

– వెంకట్రావు, కమిషనర్, తుని

కొత్త పోలింగ్ బూత్‌ల ఏర్పాటుపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి

జగ్గంపేట: అసెంబ్లీ నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నేతలతో నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 1,200 ఓటర్లు దాటిన పోలింగ్ బూత్‌లను గుర్తించి, కొత్త బూత్‌లు ఏర్పాటుపై ఆయా పార్టీల నేతల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు తదితర అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలో 240 పోలింగ్ బూత్‌లు ఉండగా, వీటిలో 12కు పైగా 1,200 ఓటర్లు దాటిన బూత్‌లు ఉన్నట్లుగా గుర్తించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జేవీఆర్ రమేష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రావుల గణేష్‌రాజా, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలి
– జేసీ చిన్నరాముడు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

గోకవరం: పౌర సేవలు అందించడంలో ప్రభుత్వ మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చౌక ధరల దుకాణాలు, గ్యాస్ ఏజెన్సీల డీలర్లు, గ్యాస్ సిలిండర్ డెలివరీ ప్రతినిధులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు పౌర సరఫరాల విషయంలో ఎటువంటి ఫిర్యాదులు లేకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రజలకు అందించే సేవలు పారదర్శకంగా ఉండేందుకు ఐవీఆర్‌ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా పనితీరును పర్యవేక్షిస్తారన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ డెలివరీ విధానంలో ప్రజల నుంచి పలు ఫిర్యాదులు తమ దృష్టికి వస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు పౌర సేవలు అందించే క్రమంలో పలువురు అక్రమాలకు పాల్పడుతున్నారని, అటువంటివి మరోసారి తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ ఎంవీ సాయి ప్రసాద్, ఏఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

జగ్గంపేట: తెల్లవారుజామున స్థానిక టవర్ కాలనీలో పేకాట శిబిరంపై జగ్గంపేట ఎస్సై రఘునందనరావు దాడి చేశారు. మంగళవారం నిర్వహించిన ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.6,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడ జూదం ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

కుండపోతతో పల్లపు ప్రాంతాలు జలమయం



సముద్ర తీరంలో దానవాయిపేట వద్ద ఎగసిపడుతున్న అలలు



జి.కొత్తపల్లిలో నేలకొరిగిన అరటి చెట్లు



ప్రత్తిపాడు అల్లూరి జంక్షన్‌లో నీట మునిగిన రోడ్డు



ప్రత్తిపాడు పంచాయతీ వెనుక వీధిలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలోని మంగళవారం ఎడతెరిపి లేకుండా కుండపోత కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మెట్ట, తీరప్రాంత గ్రామాల్లో ఉదయం నుంచి దాదాపు మూడు గంటల పాటు కుండపోత కురవగా, అడపాదడపా చిరుజల్లులు కురిశాయి. దీంతో బెండపూడి, ఏ.కొత్తపల్లి గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా కుండపోత వర్షం కారణంగా ఇటుకల తయారీ కేంద్రాలు, తాండ్ర బట్టీలు మూతపడ్డాయి. ఈదురగాలుల ప్రభావంతో మామిడి, అరటి తోటలకు స్వల్పంగా నష్టం వాటిల్లింది.

ఎగసిపడుతున్న అలలు

అల్పపీడనం కారణంగా సముద్ర అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. అద్దరిపేట, దానవాయిపేట, పెరుమాళ్లపురం తదితర తీరాల్లో రెండు మీటర్ల వరకూ అలలు ఉధృతంగా ఎగసిపడుతున్నాయి. ప్రస్తుతం వేట నిషేధం అమలులో ఉన్న నేపథ్యంలో నాటు పడవలపై మాత్రమే మత్స్యకారులు వేటకు వెళుతున్నారు. సముద్రంలో ప్రతికూల పరిస్థితుల్లో వీరంతా అప్రమత్తంగా ఉండాలని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు.

ఈదురు గాలులతో భారీ వర్షం

శంఖవరం: మండలంలోని ఉదయం నుంచి అన్ని గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్నిచోట్ల చెట్ల కొమ్మలు విరగడంతో పాటు, అరటి, మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. చేతికంది వచ్చిన మామిడి కాయలు గాలికి రాలిపోవడంతో రైతులకు నష్టం చేకూరింది. జి.కొత్తపల్లి, శంఖవరం, ఎస్.జగ్గంపేట, గౌరంపేట గ్రామాల్లో ఈదురు గాలులకు అరటి తోటలు నేలకొరిగినట్లు రైతులు తెలిపారు. కొన్నిచోట్ల విద్యుత్ అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

వర్షంతో జనానికి ఇక్కట్లు

ప్రత్తిపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా మంగళవారం తేలికపాటి వర్షం పడింది. తెల్లవారుజామున 4 గంటల నుంచి మధ్యాహ్నం వరకు చదురుమదురుగా వర్షం కురుస్తూనే ఉంది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రత్తిపాడులోని పలు వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపైనే నిలిచిపోయింది. కొద్దిపాటి వర్షానికే ప్రత్తిపాడు అల్లూరి సీతారామరాజు జంక్షన్ నీట మునిగింది. ప్రత్తిపాడు పంచాయతీ వెనుక వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఇందిరా కాలనీకి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

అధ్వానంగా మారిన పారిశుధ్యం



కప్పల చెరువు వద్ద రహదారి పక్కన పేరుకున్న చెత్త

ఏలేశ్వరం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారుల చెంతన చెత్త పేరుకుపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కప్పలచెరువు, నందివీధి, పెద్దవీధి తదితర ప్రాంతాల్లో చెత్త రహదారుల పక్కనే కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. రోజుల తరబడి చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వ్యాపించి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం పడుతున్న వర్షాలకు రహదారులపై నీరు నిల్వ ఉండిపోవడంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలో అనేక మంది డెంగీ, డయేరియా, మలేరియా వంటి వ్యాధులతో అల్లాడుతున్నారు. చెత్తతో పాటు, దోమలు విచ్చలవిడిగా పెరిగిపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు పందుల సంచారం మరింత ఎక్కువైంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి
– ఆర్డీ నాగనరసింహారావు



తుని పశువుల ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఆర్డీ నాగనరసింహారావు

తుని: మున్సిపాలిటీలో ఆదాయ వనరులను మెరుగుపర్చేందుకు అధికారులు కృషి చేయాలని మున్సిపల్ ఆర్డీ ఎం.నాగనరసింహారావు కోరారు. మంగళవారం తునిలో మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆస్తి పన్ను, షాపుల బకాయిలు, శానిటేషన్, అభివృద్ధి పనులు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పట్టణంలో జరుగుతున్న పూడికతీత పనులు, పశువుల ఆస్పత్రిలో కుక్కల కుటుంబ నియంత్రణకు ఏర్పాటు చేసిన బ్లాకులను పరిశీలించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువనసుందరి ఆర్డీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట కమిషనర్ వెంకట్రావు, డీఈఈ నాగసతీష్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

నేడు ప్రజా దర్బార్

కోటనందూరు: మండలంలోని కేఈ చిన్నయ్యపాలెంలో బుధవారం ప్రజాదర్బార్ జరుగుతుందని ఎంపీడీఓ పి.వెంకటనారాయణ మంగళవారం తెలిపారు. గ్రామ రామాలయం వద్ద ఉదయం పది గంటలకు మొదలయ్యే ఈ ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే యనమల దివ్య వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు. మండల ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



నూతన గ్రామ కమిటీల ప్రతినిధులతో ముద్రగడ పద్మనాభం, గిరిబాబు

వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ పటిష్టతకు గ్రామ కమిటీలు కృషి చేయాలని పార్టీ ప్రత్తిపాడు కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కిర్లంపూడిలో పీఏసీ సభ్యులు ముద్రగడ పద్మనాభం నివాసంలో ఆయనతో పాటు, గిరిబాబును రౌతులపూడి మండలంలో పార్టీ నూతన గ్రామ కమిటీల ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, సభ్యులతో పాటు, పలువురు నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గిరిబాబును శాలువా, పూలమాలతో సత్కరించారు. గ్రామ కమిటీలకు ఎంపికైన వారికి గిరిబాబు పార్టీ కండువాలు వేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పార్టీ విజయమే కర్తవ్యంగా పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. గ్రామ కమిటీల వారు ప్రజలతో మమేకమై, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నిర్దేశించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే..

- కార్మికుల ఆందోళన

ప్రత్తిపాడు: కార్మికుల మెడకు ఉరితాళ్లలా మారిన నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాలు మంగళవారం ప్రత్తిపాడులో ఆందోళన చేపట్టాయి. స్థానిక ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ నుండి తహసీల్దార్ కార్యాలయం వద్ద ర్యాలీ చేపట్టి, ధర్నాకు ఉపక్రమించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తీసుకురావడంతో 29 కార్మిక చట్టాలు రద్దు అవుతాయన్నారు. దీనివల్ల శ్రామికులు యాజమాన్యాలకు ఊడిగం చేయడమే అవుతుందని ఆరోపించారు. శ్రమదోపిడే మోదీ లక్ష్యమని విమర్శించారు. ఏ రంగంలోనైనా కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసి, కనీస వేతనాలను అమలు చేయాలని, హిట్ అండ్ రన్ చట్టాన్ని తక్షణమే రద్దు చేసి, కార్మికుల సంక్షేమానికి చట్టం చేయాలని కోరారు. లేబర్ కోడ్‌ల రద్దుకు టీడీపీ, జనసేన కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పోసపల్లి రమణ, సీహెచ్ వెంకటలక్ష్మి, తులసి, కాంతం, మంగ, భవానీ, ఎస్ నాగలక్ష్మి, సంధ్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వర్షం కురుస్తున్నా ధర్నాను సుమారు గంట సేపు కొనసాగించారు.

దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం

గండేపల్లి: అన్ని రంగాల కార్మికులతో కలిసి జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు సిద్ధమవుతున్నట్టు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరుబండి చంద్రావతి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కార్మికులకు నష్టాన్ని కలిగించే లేబర్ కోడ్లను రద్దు చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని తదితర డిమాండ్లను ప్రస్తావించారు. వీటి సాధనకు వివిధ రంగాల కార్మికులతో కలిసి సమ్మె చేపడుతున్నట్టు చెప్పారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు నొక్కు లలిత, శాంతి, విష్ణు లక్ష్మి, వైవీ రాజేశ్వరి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ఆందోళన

జగ్గంపేట: ప్రభుత్వం తమ డిమాండ్లను తక్షణం నెరవేర్చాలంటూ జగ్గంపేటలో ఆశా వర్కర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. రాజపూడిలో ఆశా వర్కర్ల నాయకురాలు సీహెచ్ మంగ ఆధ్వర్యంలో గ్రామంలోని మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఆశా వర్కర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి మీటింగ్‌కు టీఏ, డీఏలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కిర్లంపూడి: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ రత్నం, టి.జీవ, భవన నిర్మాణ కార్మికులు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై ఆందోళన

కోటనందూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక బస్టాండు సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ పద్మ మాట్లాడుతూ, కార్పొరేట్ వర్గాలకు లాభాలు చేకూర్చేందుకే పీఎం మోదీ నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చారన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండు చేశారు. సమస్యల పరిష్కారం కోసం జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దార్ సుభాష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కోటనందూరు బస్టాండు సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న కార్మికులు



ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు



గండేపల్లిలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



రాజపూడి గ్రామంలో ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు



కిర్లంపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద..